# వినాయకచవితి 'కాలమ్ దాటని కథల' పోటీలో ఎన్నికైన కథలు

## మర్యాద



తాతగారు ఇంటికి సున్నాలు వేయించారు. పోయిన సంక్రాంతికి అమ్మాయిలు కాని, అల్లుళ్లు కాని రాలేదు. వాళ్ల పిల్లలకు అప్పుడు సరిపడినన్ని సెలవులు దొరకలేదు. వేసవి సెలవులకు వస్తామని వాళ్లు ఉత్తరాలు వ్రాశారు. అమ్మాయి లెప్పుడు వస్తే అదే పండుగనుకొని తాతగారు సంతోషించారు.

పెద్దమ్మాయి ఢిల్లీ నుంచి వచ్చింది. స్టేషను పది కిలోమీటర్ల దూరంలో వుంది. బండి తీసుకొని అబ్బాయి వెళ్లి అక్కను, మేనకోడలిని తీసుకొచ్చాడు. రెండవ అమ్మాయి మరువాడు మద్రాసు నుంచి వచ్చింది.

పెద్దమ్మాయికి ఒక్కతే కూతురు— నాలుగేళ్లది. అప్పర్ కేజి చదువుతోంది. చిన్నమ్మాయికి ఇద్దరూ కొడుకులే. పెద్దవాడు ఎల్ కేజీ చదువుతున్నాడు, మూడున్నర ఏళ్లవాడు. రెండోవాడు ఏడాదివాడు.

అల్లుళ్లు సెలవులు దొరికినప్పుడు వస్తామన్నారు.

పల్లెటూరిలో తాతగారి యిల్లు చాల పెద్దది. పెంకుటిల్లు, విశాలమైన పడకగదులు, పెద్ద భోజన శాల, మంచి గాలి, వెలుతురు. పిల్లలకు పరిపూర్ణమైన విశ్రాంతి లభించాలని తాతగారు అన్ని ఏర్పాట్లు చేయించారు.

ఈ సంవత్సరం చేసిన వాటిలో ఒక కొత్త ఆకర్షణ వుంది. పెరటిలో ఒక పెద్ద మామిడిచెట్టుంది. దాని కొమ్మ ఒకటి కొంచెం దిగువకుంది. రింగులు బిగించిన పెద్ద పీటకు బలమైన తాళ్లు కట్టి, ఆ కొమ్మకు ఊయల నొకటి ఆయన వ్రేలాడదీశారు.

ఊయలను చూడగానే మనుమడు, మనుమరాలు ఎగిరి గంతులేశారు. వాళ్లను ఎండ వల్లబడేవరకు ఆపడం చాలా కష్టమయింది.

మనుమడు, మనవరాలు ఊయలలో కూర్చున్నారు. కిందికి కట్టడం నుంచి, పిల్లలకు కూడా కాళ్లకు నేల అందుకొచ్చి, వాళ్లంతట వాళ్లే ఊయలను ఊపుకోడానికి వీలుగా వుంది. వాళ్లను కూచోపెట్టి కొంచెంసేపు అక్కడుండి, మెల్లగా ఊగమని చెప్పి తాతగారు ఏదో పనిమీద యింట్లోకి వెళ్లారు.

తాతగారు లోపలినుంచి తిరిగి వచ్చేసరికి పరిస్థితులు మారిపోయాయి. ఊయల జోరుగా ఊగుతోంది. పెద్ద మనుమడు ఊయల బల్లమీద నిలబడి కరాటే ప్రదర్శన లిస్తున్నాడు.

తాతగారికి చాల కోపం వచ్చి, మనుమలను కోప పడ్డారు.

మనవడికి అంతకన్నా కోపం వచ్చి ''నోర్ముయ్ !'' అన్నాడు తాతగారిని.

ఆ మాట విని తాతగారు నిలువున నీరయి పోయారు.

అప్పుడు మనవరాలు అంది:

''తమ్ముడూ! అలా పెద్దవాళ్లనకూడదమ్మా!

'తాతగారూ! నోరుమూసుకోండి ' అని అనాలి!''

మనుమరాలి మర్యాదైన మాటలు విని తాతగారు చేష్టలు దక్కి నిలబడిపోయారు.

— ఘండికోట సీతారామ

## క్రమశిక్షణ



''రోజీ స్నానం చేసి రా!''

''రోజీ మేడమీద నా చెప్పులు మర్చిపోయాను తీసుకురా?''

''రోజీ తోటమాలి వచ్చేడేమో చూసిరా!''

''రోజీ టేప్ రికార్డరు ఆన్ చెయ్యి!''

''రోజీ! వీరయ్యను పిలువు.''

''రోజీ ఇక నువ్వెళ్ళి నీ కుర్చీలో కూర్చో.''

యజమానురాలి ఆజ్ఞలకు తోకాడించుకుంటూ, చలాకిగా, తెల్లగా మెరిసిపోతున్న కుక్క రోజీ విన్యాసాలను వింతగా, ఆనందంగా తిలకిస్తూ, మనసులోనే మహిళా మండలి ప్రెసిడెంట్ శ్రీమతి మాలతీదేవిగారి క్రమశిక్షణకు ఆశ్చర్యపోతూ సోఫాలో కూర్చుని అల్పాహారాన్ని సేవిస్తున్నారు నలుగురు మహిళా మండలి సభ్యురాళ్ళు.

సభ్యురాళ్ళు, మాలతీదేవితో ఏదో కార్యక్రమ నిర్వహణకై నిధుల సేకరణ నిమిత్తం చర్చిస్తున్నారు.

మాటల మధ్యలో ఏదో వ్రాసి, నచ్చక నలిపి పారేసిన కాగితాన్ని రోజీ వచ్చి తీసుకెళ్ళి డస్ట్‌బిన్‌లో ఎవరూ చెప్పకుండానే పారేసింది. అతిథుల్లో ఒకామె చేతినుంచి జారిన చికెన్ పకోడాను, క్రింద పడిన వెంటనే రోజీ పరుగున వచ్చి నోట కరచి, తింటుందేమోనన్న ఆలోచనను బద్దలుకొట్టి, ఆ చికెన్ పకోడాను కూడా నోట కరచి తీసుకెళ్ళి డస్ట్‌బిన్‌లో పడేసింది.

నలుగురు అతిథులు ముక్కు మీద వ్రేళ్ళు వేసుకోకుండానే నోరు ఆవులించి ఆశ్చర్యపోయారు.

''అవునండీ! చాలా క్రమశిక్షణతో పెంచాను, మా రోజీని'' గర్వంగా నవ్వుతూ చెప్పింది మాలతీదేవి.

''టింగ్...... టింగ్...'' కాలింగ్‌బెల్ మ్రోగింది.

కేరింతలు కొట్టుకుంటూ మాలతీదేవి ముద్దుల కొడుకు, కూతురు కాన్వెంటు నుంచి వచ్చారు. వచ్చీ రావడంతోనే సోఫాలో వున్న అతిథుల్ని నెట్టుకుని మధ్య చతికిలపడి -

''కొత్త ఆంటీల్లా వున్నారే!? నల్ల ఆంటీ!! లావు ఆంటీ!! బక్క ఆంటీ!! పళ్ళెత్తు ఆంటీ!'' అని పళ్ళికిలించి వర్ణించారు.

''అన్నీ తినేసారా!? మాకేమన్నా మిగిల్చారా లేదా??'' వాళ్ళు తింటున్న ప్లేటుల్లోవి చెరొకటీ తీసుకుని తింటూ ప్రశ్న.

తింటున్న ఎంగిలి చేతులతోనే షూస్ విప్పి, మూలకు గిరాటు వేసి, సాక్సు తీసి టీపాయ్ మీద విసిరి, పుస్తకాల సంచులు మాసిన బట్టల మూటల్లా క్రింద దొర్లించి, బిక్క వచ్చి చూస్తున్న మాలతీదేవి మీదకు ఎగ్రబాకి ''మమ్మీ! ఎవరీ కొత్త ఆంటీలు, చందాల కోసమేనా వచ్చారు''-ఎంగిలి , జిడ్డు చేతుల్ని మాలతీదేవి పట్టుచీరకు తుడుస్తూ······అప్పటి వరకూ ప్రశాంతంగా, క్రమశిక్షణకు గుర్తింపుగా రోజీతో గడిపిన అతిథులకు పిల్లలొచ్చిన తరువాత క్రమక్రమంగా ఏ మాటల శిక్షల్ని ఎదుర్కోవాలోనని భయం... భయంగా చూస్తున్నారు.

''క్షమించండి. వీళ్ళు వాళ్ళ నాన్నగారి పెంపకంలో పెరిగారు. క్రమశిక్షణ లేదు'' అని ప్రస్తుతానికి గండం గట్టెక్కడానికి మాలతీదేవి అబద్ధం చెప్పక ఏం చేస్తుంది!

-కోకా సాయి

ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన కాలమ్ దాటని కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

- ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన కథ: ______________________

రచయిత/ రచయిత్రి: ______________________

పేజీ నంబరు: ______________________